క్లుప్తంగా

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

డీసీహెచ్ఎస్ సంగారెడ్డి



రోగులతో మాట్లాడుతున్న సంగారెడ్డి

జోగిపేట(అందోల్): డాక్టర్లు అందుబాటులో ఉంటూ సేవలందించాలని డీసీహెచ్ఎస్ సంగారెడ్డి అన్నారు. శనివారం జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ల పనితీరు, సమయానికి వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ సేవలు, మందులు అందుబాటులో ఉంచాలని సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు సూచించారు. రోగులపై ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని ఆయన ఆదేశించారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో నార్మల్ డెలివరీలు ఎక్కువగా అయ్యేలా చూడాలన్నారు. ఈ మధ్యకాలంలో సర్జరీలో చేస్తున్న తీరును ప్రశంసించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా యాత్ర సాగింది. ఈ సందర్భంగా భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతూ ముందుకు సాగారు. దారి పొడుగునా భక్తులు పూజలు చేస్తూ.. దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో శనివారం సాయంత్రం ఇస్కాన్, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జగన్నాథ్ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనాలతో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మైహోం అంకురాలో జగన్నాథ్ రథయాత్ర నిర్వహించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడిన వస్తువులు

టేక్మాల్(మెదక్): తాళం వేసిన ఇంట్లో చోరీ ఘటన మండల కేంద్రం టేక్మాల్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లని భాగ్య కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. నూతనంగా నిర్మించుకుంటున్న ఇంటి పనులను చూసుకునేందుకు టేక్మాల్‌కు వచ్చారు. పాత ఇంటిలో పాములు ఉన్నాయని భయంతో పక్క ఇంటి కిష్టయ్య ఇంట్లో పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికి ఇంటితాళం పగలగొట్టి బీరువాలోని వస్తువులన్నీ చిందవందరగా పడవేశారు. బీరువాలోని మూ డు తులాల పుస్తెలతాడు, డబ్బాలో పెట్టి న నగదును దొంగిలించుకుపోయారు. విష యం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్‌టీసీ ప్లాంట్ ఏర్పాటుకు భూపరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన భూమిని పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా చేపట్టిన అమృత్ 2.0 పథకం ద్వారా పెరుగుతున్న పట్టణ జనాభా దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో రూ.62 కోట్ల వ్యాయంతో నిర్మించనున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు 10 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. శనివారం తహసీల్దార్ దేవదాస్ మాజీ జె డ్పీటీసీ బాల్‌రెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలించా రు. బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యర్థజలాలు, మురికి నీటి కాలుష్య సమస్యను పరిష్కరించేందుకు.. ఎస్‌టీసీ ప్లాంట్ ఏర్పాటు నిధులకు సహకరించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, బీరప్ప, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుపై అసంతృప్తి

- పూర్తి వ్యవసాయ ఆధారిత ప్రాంతం
- ఆదాయంలో వెనుకపడిన జిన్నారం



జిన్నారం మండల కేంద్రం.

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామపంచాయతీలుగా ఉన్న జిన్నారం మండలాన్ని నగర విస్తరణలో భాగంగా నూతన మున్సిపాలిటీగా ఆవిర్భవించనుంది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశాల్లో నియోజకవర్గం పరిధిలోని జిన్నారం, ఇంద్రేశం ప్రాంతాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మండలవ్యాప్తంగా మున్సిపాలిటీ ఏర్పాటుపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం జిన్నారం 14 గ్రామపంచాయతీలతో మండలంగా ఉంది. కొన్ని రోజుల క్రితం గడ్డపోతారం, మాదారం, ఖాజీపల్లి, వావిలాల, లక్ష్మీపాతిగూడెం ఐదు పంచాయతీలను కలుపుతూ గడ్డపోతారాన్ని మున్సిపాలిటీగా చేస్తూ గేజిట్ విడుదల చేసింది. దీంతో జిన్నారం, జంగంపేట, మంగంపేట, శివనగర్, కొడకంచి, అండూర్, నల్తూరు, సోలక్‌పల్లి, రాళ్లకత్వ తొమ్మిది గ్రామాలతో మండలంగా ఉంది. ప్రభుత్వ ప్రకటనతో మిగతా గ్రామాలు కలుపుతూ మున్సిపాలిటీగా మార్చనున్నట్లు ప్రకటించింది. అయితే జిన్నారం మండలంలోని పంచాయతీలన్నీ పూర్తి గ్రామీణం ఉండడం, మండల పరిధిలో పరిశ్రమలు వ్యాపార రంగాలు లేకపోవడంతో మున్సిపాలిటీగా మారిస్తే ఎదురయ్యే సమస్యలను ప్రజలకు భారంగా మారతాయని అసంతృప్తి చేస్తున్నారు. అందులో వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు అధికంగా ఉండడంతో ఆర్థికభారంగా తలెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులకు, ప్రస్తుతం ఉన్న ఇంటి పన్ను పెనుభారంగా మారుతాయని అంశాలపై గ్రామాల్లో చర్చలు సాగుతున్నాయి.

ప్రస్తుత మున్సిపాలిటీల్లో పర్యవేక్షణ లోపం

ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన గడ్డపోతారం మున్సిపాలిటీలో రోజురోజుకు పెరుగుతున్న సమస్యలు. మున్సిపల్ పరిధిలోని గ్రామాల సందర్శించే అధికారులు లేక పారిశుద్ధ్యం, మంచి నీటి కొరత తీవ్రస్థాయికి చేరుకుంది. దీంతో జిన్నారం మున్సిపాలిటీగా మారితే సమస్యలు తలెత్తే అవకాశం లేకపోలేదని ప్రజలు అసంతృప్తి చెందుతున్నారు.

ఆర్థిక భారం తప్పదు

ప్రస్తుత మున్సిపాలిటీలతో పోలిస్తే ఏ కోణాల్లో కూడా జిన్నారం మున్సిపాలిటీగా మార్చేందుకు అర్హత లేదు. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీల ఆదాయం అంతంత మాత్రమే. తీరా మున్సిపాలిటీగా మారితే ఆదాయ వలన లేక ఆర్థిక ఇబ్బందులతో తలెత్తే ఆస్కారం ఉందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిన్నారాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి నోచుకోక ఆర్థిక భారంతో మరింత వెనుకబడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: బల్దియా పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌ల పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మున్నూరు కాపు సంఘం వరకు రూ. కోటి 40 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తదితర మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, న్యాయవాది నాగరాజుయాదవ్, జీహెచ్ఎంసీ డీఈ నరేందర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న తరగతి గదుల ప్రారంభం

నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రూ.4కోట్లతో నిర్మించిన 15 అదనపు తరగతి గదులు పూర్తయ్యాయని.. సోమవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధి చిన్నవాగు సమీపంలోని స్మశాన వాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.49 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో ప్రహరీ గోడ, చితి మండపాలు నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకునిరావాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఒక్కరోజులోనే కమిషనర్ బదిలీ



జోగిపేట(అందోల్): అందోల్–జోగిపేట కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్ తిరుపతి బదిలీకాగా, ఆయన స్థానంలో ఈనెల 24న కమిషనర్‌గా గురులింగం బాధ్యతలు స్వీకరించారు. మరుసటి రోజు నుంచి శుక్రవారం వరకు సెలవుపై వెళ్లారు. శనివారం ఆయన బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఆయన కేవలం ఒక్క రోజు మాత్రమే కమిషనర్‌గా పనిచేశారు. ఆయన స్థానంలో అందోల్- జోగిపేట నూతన కమిషనర్‌గా రవీందర్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గురులింగం నందికొండ మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గజ్వేల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రవీందర్ జోగిపేటకు బదిలీపై వచ్చారు. ఒక్కరోజులో కమిషనర్ల మార్పు స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రపంచ స్థాయి విద్యను అందించాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చామని యూఎస్ఏలోని కంబర్ ల్యాండ్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొవోస్ట్ డాక్టర్ మార్క్ హర్ష అన్నారు. శనివారం వారి బృందంతో కలిసి సంగారెడ్డి మండలంలోని పసల్వాది శివారులోని ఎమ్మెన్నార్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అంతర్ విభాగ విద్యా కార్యక్రమాలు, ఆవిష్కరణ ఆధారిత పరిశోధన పర్యావరణ వ్యవస్థలు, సామర్థ్య నిర్మాణం వంటివి విస్తతం చేయడానికి ఎమ్మెన్నార్ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

చిలప్‌చెడ్(నర్సాపూర్): సైబర్ నేరగాళ్ల వలలో పడి అమాయకులు తమ ఖాతాలోని డబ్బులను పోగొట్టుకుంటున్నారని ఎస్ఐ నర్సింహులు అన్నారు. ఇందులో భాగంగా సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లోని కూడళ్లలో వాల్ పోస్టర్‌లు అంటించామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. తమ సిబ్బందితో కలిసి ప్రతి రోజు మండల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికి గ్రామాల్లో వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేశామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

వట్‌పల్లి(అందోల్): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి మమ్మద్ షరీఫ్ అన్నారు. శనివారం అందోల్ మండల పరిధిలోని పోసానిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువుతోనే ఏదైనా సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. బాలకార్మిక చట్టం, విద్యాహక్కు చట్టం, లైంగిక వేదింపులు, బాల్య వివాహాలు వంటి చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఏదైన సమస్య వచ్చినప్పుడు భయపడకుండా ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. ఎస్ఐ పాండు మాట్లాడుతూ బాలికల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.విద్యార్థులు, మహిళలు ప్రయాణాల్లో గాని నివాస ప్రాంతాల్లో గాని ఇబ్బందులు గురైతే తమకు సమాచారం అందిస్తే పోలీస్ రక్షణ కల్పించి సాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, న్యాయవాదులు లింగమయ్య, నర్సింలు, వెంకట క్రిష్ణ, పాఠశాల హెచ్ఎం క్రిష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జాబ్ మేళాలతో ప్రయోజనం

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో ఆదివారం నర్సాపూర్‌లోని సాయిక్రిష్ణ గార్డెన్‌లో నిర్వహించే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు అర్హతను బట్టి వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్‌లతో సకాలంలో హాజరుకావాలని సూచించారు.

◆ వానాకాలం పంటలపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): వానాకాలంలో రైతులు భూపరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాలని నర్సాపూర్ ఏడీఏ గంగుమల్లు అన్నారు. శనివారం మనోహరాబాద్‌లోని ధర్మరాజ్‌పల్లిలో రైతులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నారుమడిలో తీసుకోవాల్సిన మెలకువలు, వరి పంటకు జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కలిప్పించారు. రైతులు తమ పంటల వివరాల ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు. దీంతో పంట నష్టం తదితర అంశాలను బేరిజు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈఓలు సచిన్, నరేందర్, రైతులు పాల్గొన్నారు.

◆ సోలార్ ప్లాంటుకు స్థలం పరిశీలన



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి పరిధిలో ఇందిరమ్మ మహిళా శక్తి, పీఎంకుసుమ్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన భూమిని, రాష్ట్ర సెర్ప్, నాబార్డ్ ప్రతినిధుల బృందం శనివారం పరిశీలించారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన విధి విధానాలు ఖరారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కృష్ణారావు, నాబార్డ్ ఏజీఎం రామారావు, డీపీఎం జయశ్రీరాజ్, ఏపీఎం శివకుమార్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

◆ ఘనంగా బాల మేళా

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో శనివారం బాల మేళా(పిల్లల పండుగ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సీడీపీఓ అంజమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టిక ఆహారంతో పాటు యూనిఫామ్స్ అందించి, వారికి ఇంగ్లిష్ విద్యను నేర్పుతున్నామన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలపాలిట సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి చిట్కుల్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు పద్మ రూ. 45 వేలు, గల్ల సునీల్ రూ. 19 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో చిట్కుల్ మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్, బీఆర్ఎస్ నాయకుడు కున్యానాయక్ పాల్గొన్నారు.

◆ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

పెద్దశంకరంపేట(మెదక్): వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది కోరారు. శనివారం స్థానిక బాలుర బీసీ హాస్టల్, బాలికల హాస్టల్‌లో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి హాస్టల్‌లో విధులు నిర్వహించే సమయంలో వంటగదిని శుభ్రంగా ఉంచుకోవడం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడడం, దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది యాదయ్య, పాల్, వెంకటేశం, వార్డెన్‌లు బాబు, జుబేదా తదితరులున్నారు.

మహనీయుల విగ్రహాలకు రంగులు



సాక్షి ఎఫెక్ట్

తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మహనీయుల విగ్రహాలకు వేసిన రంగులు ఊడిపోయాయి. దీంతో ఈనెల 25న సాక్షి దినపత్రికలో 'మహాత్ములూ.. మన్నించండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం మహాత్ముల విగ్రహాలకు రంగు వేయించారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు):

41మందికి ప్రొసీడింగ్‌ల పంపిణీ



ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): టేక్మాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రొసీడింగ్ కాపీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేష్ ఆధ్వర్యంలో శనివారం 41మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు విడతల వారీగా అర్హులందరికీ వస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు గ్రామస్తులు తమకు రాలేదని, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని అధికారులు, నాయకులను ప్రశ్నించగా అర్హులందరికీ రెండొవిడతలో వస్తాయని బదులిచ్చారు. నిరుపేదలకు ఇళ్ల మంజూరు పంచాయతీ కార్యాలయం వద్ద వాగ్వాదానికి దిగారు. ఎంపీఓ రియాజొద్దిన్, ఈఓ రాకేష్, నాయకులు సుధాకర్, కిషోర్, మజహర్, సాగర్, శివరాజ్ తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన చిలప్‌చెడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను చేపట్టాలని హౌసింగ్ ఏఈ అరుణ్ అన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

గ్రామ కార్యదర్శి సుభాశ్



అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాశ్ అన్నారు. శనివారం మండలం పరిధి ఇంద్రేశం గ్రామంలోని దర్గా సమీపంలోని అక్రమ నిర్మాణాన్ని పాక్షికంగా కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులకు మించి నిర్మిస్తే నోటీసులు జారీ చేసి, కూల్చివేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామ పరిధిలోని అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

న్యాయవ్యవస్థలో దళితలకు పెద్దపీట

న్యాయవాది ప్రభుదానం, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములు

పటాన్ చెరు: కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవ్యవస్థలో దళిత సామాజికవర్గానికి పెద్దపీట వేస్తున్నారని సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది ప్రభుదానం, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు.. నియోజకవర్గం నుంచి దళిత సామాజికవర్గానికి చెందిన తమ ఇద్దరికీ సంగారెడ్డి జిల్లా కోర్టులో జీపీ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అవకాశాలు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి రాజనర్సింహ, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దళిత సామాజికవర్గంపై ప్రభుత్వ చిత్తశుద్ధికి తమ నియామకాలు ప్రత్యక్ష సాక్షామని అన్నారు. ప్రధానంగా తమ నియామకాల అంశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సంపూర్ణ సహకారం అందించారని చెప్పారు. జిల్లా న్యాయస్థానంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు. న్యాయం అందించాలన్న లక్ష్యంతో తమ సామాజిక వర్గానికి పెద్దపీట వేశారని అన్నారు. సమావేశంలో అడ్వకేట్ యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రైవేట్ పాఠశాలల యజమాన్యం విద్యాశాఖ నియమాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ మల్లేశం అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యంతో సమావేశం నిర్వహించారు.

WANTED STAFF
Wanted Ex. Servicemen at Taddanpally Toll Plaza.
Contact:
SRI SAI ENTERPRISES
Kurnool Dist. Cell
8948948988

ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలి

సబ్ సెంటర్ వైద్యురాలు జెస్సికా



గర్భిణీలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న జెస్సికా

కంది(సంగారెడ్డి): మహిళలు ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేయించుకోవాలని ఎద్దు మైలారం సబ్ సెంటర్ డాక్టర్ జెస్సికా సూచించారు. శనివారం కంది మండల పరిధిలోని కాశీపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేయడంతో పాటు గర్భిణీలకు పౌష్టికాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రసవాలకు అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలు ప్రభుత్వ ఆసుపత్రిలో లభిస్తున్నాయని తెలిపారు. గర్భిణీలు వైద్య సిబ్బంది సలహాలు సూచనలు పాటించడంతో పాటు పౌష్టికా హారం తప్పకుండా తీసుకోవా లన్నారు. పుట్టినప్పటి నుంచి 10 ఏళ్ల వరకు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయించుకోవాలన్నారు. ప్రతి నెల రెండవ, నాల్గవ శనివారం సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల టీచర్లు జ్యోతి, శారద, ఆశావర్కర్ రాజేశ్వరి గర్భిణీలు, పిల్లల పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్ర కురుమ సంఘం నాయకుడు నాగేష్

జోగిపేట(అందోల్): గొల్ల కురుమలు విద్యతోనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని మాజీ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కురుమ సంఘం నాయకులు బూరుగడ్డ పుష్ప నాగేష్ అన్నారు. పట్టణంలోని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు గూడెం మల్లయ్య నివాసంలో శనివారం నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు పుష్పనాగేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400